# రెండో నాన్న.

మామిడి అప్పారావుగారు.

రామయ్య వట్టిఅమాయకుడు. వీధిబడిలో ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నాడు. సుమారు ఏభై వత్సరాలుంటాయి. అతని ప్రథమ భార్య చనిపోయింది. రామయ్యకు ఆమెవలన ఒకకుమారుడు మాత్రం కలిగాడు. అతనిభార్య చనిపోయినతరువాత మళ్లీ తనసోదరి కుమార్తెయగుసుందరిని వివాహం చేసుకున్నాడు.

సుందరిని చూచినవారు "భగవంతుడు అందాన్నంతయు ఒకముద్దగా జేసి, ఆమెలో మిళితముజేసి సృష్టించాడ"నుకుంటారు. ఆగుండ్రని మొహం, అందలి ఆకర్ణాంత విశాలవిలోచనాలు ఆమెలికలు తిరిగిన ముంగురులు, ఆబంగారుఛాయను బోలు ఆమెశరీరం ఇవన్నీ ఏపురుషునిమనస్సును ఆకర్షించవు?

సుందరి యింటికి ఎదురుగా రామారావుఇల్లు ఉండడంవల్ల సుందరీ,రామారావులు అస్తమానం చూచుకుంటూ ఉండేవారు. ఆమె తనవిశాలనేత్రములతో రామారావుని చూస్తూ ఆచూపులతోనె అతనితో మాట్లాడేది. అతనివలన తనకోరికకు సముత్తరము గ్రహించడానికి అతన్నిజూచి నవ్వేది. ఆనవ్వులో వెల్లువలై పారే ముగ్ధప్రణయవాంఛను గ్రహించడానికి రామారావు ఉక్కిరి బిక్కిరి అవుతుండే వాడు. కాని చివరకు "సరే" అన్నాడు.

వారిరువురి మనస్సు లేకమయాయి. ఒకరినొకరు చూడకుండా ఒకనిముషమైనా ఉండలేక పోయేవారు. రామయ్య యింటిలోనుంచి బైటకివెళ్లుటయే తరువాయిగా రామారావు లోపల దూరేవాడు.

ఒకరోజున రామయ్య వీధిలోనికి వెళ్ళినవెంటనే రామారావు లోపల ప్రవేశించాడు. రామయ్యకొడుకు (ఏడేళ్ళవాడు) రామారావుని చూచి సుందరిని "అమ్మా! ఆఁఅబ్బెవరే?" అని అడుగగా సుందరి నవ్వుతూ "నీకు రెండో నాన్నవుతారు" అంది. ఇంతలో రామయ్య సుందరిని పిలుస్తూ బైటతలుపుకొట్టాడు. రామారావు బైటకుపోవుటకు వేరొకమార్గం లేకపోవుటచే ఆయింటిలో నున్న అటుకుఎక్కాడు. సుందరివెళ్లి తలుపుతీసి "ఇప్పుడేగా వెళ్లారు మళ్ళీవచ్చారేం?" అని అడిగింది. రామయ్య "గొడుగు మరచిపోయాను. అంచేత వచ్చాను" అని చెప్పి గదిలోనికి వెళ్లాడు. అతడు గదిలోనికి వెళ్లుటతోడనే కుర్రవాడు "నాన్న! రెండో నాన్నడుగో" అని వ్రేలుపెట్టి పైకి చూపించాడు. రామయ్యకు కుర్రవాడు అన్నది అర్థముకాకపోవుటచే పైకి ఒకసారిచూచి, "ఏమిటి?" అన్నట్టుగా సుందరివైపు చూచాడు. ఆమె "ఏమీలేదండీ! ఆగోడనున్న అద్దంలో మీప్రతిబింబాన్ని చూచి అలాఅంటున్నాడు." అని చెప్పింది. రామయ్య ఏమీఅనుమానం కలుగకపోవుటచే అచ్చటున్న గొడుగుతీసుకొని వెళ్ళిపోయాడు. తరువాత రామారావు అటుకపైనుంచి దిగాడు.